క్లుప్తంగా

నేడు జాతీయ లోక్ అదాలత్

పిఠాపురం: స్థానిక 12వ అదనపు జిల్లా జడ్జి కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ తెలిపింది. ఈ లోక్ అదాలత్‌లో చిన్న చిన్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన ఉపవాస ప్రార్థనలు

పెద్దాపురం: క్రీస్తు శాంతి ప్రార్థన మందిరంలో ప్రపంచ శాంతి కోసం రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉపవాస ప్రార్థనలు శుక్రవారంతో ముగిశాయి. తిరుపతి క్రీస్తు శాంతి ప్రార్థన మందిరం నిర్వాహకులు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాకినాడకు జోషి ప్రశాంత్ దైవ ప్రసంగాన్ని అందించారు. మందిరం వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం, దైవజనులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జరిమానా

సామర్లకోట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి కాకినాడ కోర్టు శుక్రవారం రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్టు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ నిఘాలో ముగ్గురిని గుర్తించి కోర్టుకు హాజరు పరచినట్టు ఆయన తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కొత్తపల్లి: పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని అరుణోదయ చైర్ పర్సన్ విమలక్క అన్నారు. స్థానిక ముప్పారావు అచ్చియమ్మ కల్యాణ మండపంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. రైతు కూలీలపై సమస్యలపై చర్చించారు. పలువురు రైతు కూలీ సంఘం నాయకులు, రైతు కూలీలు పాల్గొన్నారు.

పెద్దాపురంలో...

పెద్దాపురం: పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు అన్నారు. మండలంలోని వడ్లమూరు జిల్లా పరిషత్ హైస్కూల్, ఆర్బీకేల వద్ద ఉపాధి పనుల్లో చేపట్టిన వసుధకి వందనం పేరిట శుక్రవారం సుమారు వంద కొబ్బరి మొక్కలు నాటారు. ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ మురళి, వాయిలేటి చిన్నారావు, ఉండమట్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

సామర్లకోట: ఈ నెల 30 నుంచి వచ్చే నెల 28వ తేదీ వరకు ప్రతి సచివాలయంలోను జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్షపై మండల పరిధిలోని వైద్యాధికారులు, హెల్త్ వర్కర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ఈ నెల 15 నుంచి ఏఎన్ఎం, వలంటీర్లు బృందాలుగా సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య అవసరాలను గుర్తించాలన్నారు.

భూ సమగ్ర సర్వేపై అవగాహన ఉండాలి

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న భూ సమగ్ర సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని రాష్ట్ర రిసోర్స్ పర్సన్లు పీవీ శిరీష, తరంగిణి అన్నారు. కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా శుక్రవారం వారు భూ సమగ్ర సర్వేపై శిక్షణ నిర్వహించారు. సాయంత్రం మండల పరిధిలోని ఉండూరు శివారు మామిళ్లదొడ్డి ప్రాంతానికి కార్యదర్శులను ఫీల్డ్ సర్వేకు తీసుకువెళ్లారు. ఈటీసీ ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, నిహారిక, ఎస్‌కె మోహిద్దీన్ పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

పెద్దాపురం: ప్రతి రైతు తమ పంట నమోదు తప్పని సరిగా చేయించుకోవాలని ఏడీఏ దైవ కుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఏఓ సంజయ్‌కుమార్ అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఏడిఏ మాట్లాడుతూ ఈ క్రాప్‌లో ప్రతి రైతు తమ పంట నమోదు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయల సలహా మండలి సభ్యులు యినకొండ వీర విష్ణుచక్రం, ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత, ఏఈఓ ప్రసాద్, వీపీఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొత్తపల్లి: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్టు స్థానిక పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కుతుకుడుమిల్లి గ్రామనికి చెందిన దుబాకుల మధుసూదనరావు(30) ఈ నెల 4వ తేదీ రాత్రి కొత్తపల్లి నుంచి ఉప్పాడ మోటార్ సైకిల్‌పై వెళుతున్నాడు. రవీంద్రపురం వద్ద ఆగి ఉండగా ఉప్పాడకు చెందిన ముత్యాల నూకరాజు మోటార్ సైకిల్‌తో వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మధుసూదనరావు తలకు తీవ్రగాయం కాగా చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామ సేవాలయాలు

- సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు
- ఇంటి వద్దకే అందుతున్న పథకాలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



ఉప్పాడ గ్రామ సచివాలయం-1

కొత్తపల్లి: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తీసుకురావాలనే ఆలోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. సచివాలయాల్లో 10 నుంచి 12 శాఖల అధికారులను నియమించారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా వారి గ్రామంలోనే సేవలు పొందేలా వాటిని తీర్చిదిద్దారు. దీంతో సచివాలయాలకు దేశంలోనే మంచి పేరు ప్రతిష్టలు వచ్చాయి. ప్రజలకు సచివాలయాలు.. సేవా నిలయాలుగా మారాయి.

ప్రజల వద్దకే పాలన

సచివాలయాల ఏర్పాటుతో ప్రజల వద్దకే పాలన నినాదం నిజమైంది. గత పాలకులు ఎప్పుడో ఒకసారి చుట్టపు చూపుగా వచ్చి ఇంటి వద్దకే పాలన అందిస్తున్నామని గొప్పలు చెప్పుకునే వారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం పక్కాగా ఇంటి వద్దకే పాలన అందిస్తోంది. వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్లు, రేషన్‌తో పాటు పలు పథకాలు లబ్ధిదారుల ఇంటికే అందుతున్నాయి.

ప్రతి రెండు వేల జనాభాకు..

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేయాలంటే రూ.వేల కోట్లతో కూడుకున్న పని. అయినప్పటికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. అందులో ఉద్యోగులను నియమించి ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

సచివాయాల్లో అందిస్తున్న సేవలు

సచివాలయాల ద్వారా ప్రజలకు వందల రకాల సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా కొత్త పింఛన్ల మంజూరు, అర్హులందరికీ ఇళ్లు, జగనన్న చేయూత, మ్యుటేషన్, భూముల రీ సర్వే, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పీఎం కిసాన్ తదితర పథకాలకు సంబంధించి అన్ని రకాల సేవలు సచివాయాల్లో అందుబాటులో ఉన్నాయి. గతంలో రేషన్ కార్డు, ఇళ్ల స్థలాలు వంటి ఏ పథకం కావాలన్నా మండల కేంద్రాలకు కాళ్లు అరిగేలా తిరిగే వాళ్లమని, ఇపుడు అటువంటి ఇబ్బందులు లేకుండా సొంత ఊరిలోనే అన్ని సేవలు పొందుతున్నామని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తపల్లి మండలంలో సచివాలయాల వివరాలు		
సచివాలయాలు	-	25
గృహాలు	-	29,526
వలంటీర్లు	-	527

గత నాలుగేళ్లలో వివిధ పథకాల ద్వారా పొందిన లబ్ధి..

పథకం	లబ్ధిదారులు	పొందిన సొమ్ములు (కోట్లలో..)
జగనన్న అమ్మ ఒడి	12,043	రూ.35.45
జగనన్న వసతి దీవెన	3210	రూ.6.12
జగనన్న విద్యా దీవెన	4389	రూ.9.18
వైఎస్సార్ రైతు భరోసా	8750	రూ.148.38
మత్స్యకార భరోసా	6521	రూ.16.30
నేతన్న నేస్తం	398	రూ. 3.89
పింఛన్ కానుక	15387	రూ.109.78
వైఎస్సార్ ఆసరా	13980	రూ.31.36

సొంతూరులోనే అన్ని రకాల సేవలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ జగనన్న చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,750 అందిస్తున్నారు. ఈ సొమ్ములు మా కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వలంటీర్లే వచ్చి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు తీసుకువెళుతోంది. సొంత గ్రామంలోనే అన్ని సేవలు అందుతున్నాయి.

–రాజబాల రమణ, చేయూత లబ్దిదారురాలు, కొమరగిరి

ఇంటికే పింఛను



నా భర్త మృతి చెందడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాను. నాలాంటి వారికి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికే పింఛను అందిస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ ఉదయాన్నే తలుపుతట్టి పింఛను అందిస్తోంది. గతంలో పింఛన్లు పొందాలంటే పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం ఇంటికే పథకాలు అందుతున్నాయి.

– పొన్నగంటి సత్యవతి, పింఛను లబ్ధిదారు, కొత్తపల్లి

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని మహిళకు వివరిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో భాగంగా శుక్రవారం 9వ వార్డు పరిధిలో పద్మనాభకాలనీ, కుమ్మరవీధి తదితర ప్రాంతాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఆ వార్డు కౌన్సిలర్లు పెంటకోట సత్తిబాబు, బలుసు కనకం, సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించి పంపిణీపై ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, ధర్మేంద్ర, కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కర్, విడదాసరి రాజా, నాగబోయిన రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఆందోళన



పిఠాపురంలో ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

పిఠాపురం: ఉత్తరప్రదేశ్‌లో న్యాయవాదులపై ఆ రాష్ట్ర పోలీసులు విచక్షణారహితంగా లాఠీ చార్జి చేయడానికి నిరసనగా పిఠాపురంలో న్యాయవాదులు శుక్రవారం ఆందోళన చేశారు. పిఠాపురం కోర్టుల ఆవరణలో పిఠాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లాయర్‌పై లాఠీచార్జి చేసిన పోలీసులను శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హాపూర్‌లో న్యాయవాదులపై ఆ రాష్ట్ర పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జి చేయడాన్ని ఖండించారు. పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని రాజకీయ నాయకుల మెప్పుకోసం పని చేస్తున్నారని ఆరోపించారు. లాయర్లపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు తగిన రక్షణ కల్పించాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ పిఠాపురం యూనిట్ ప్రధాన కార్యదర్శి జీఎస్ భాస్కరాచార్యులు కోరారు. కార్యక్రమంలో పిఠాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఆర్‌వీ రమణారావు, బీఏకే ఈశ్వరబాబు, దల్లి శ్రీనివాస్, కొంగు నూకరాజు, రమేష్, ఎస్‌కే అబ్రిష, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని జి.రాగంపేట గ్రామంలో శుక్రవారం సేంద్రియ సాగు విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఎంసీ వైస్ చైర్మన్ బందారు వీరబాబు అధ్యక్షతన జరిగిన సభలో దొరబాబు మాట్లాడుతూ సేంద్రీయ సాగు ద్వారా నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందించే దిశగా ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించిందన్నారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మండలంలోని 121 మంది దళిత రైతులకు పీఎండీఎస్ విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, మాజీ జెడ్పీటీసీ బంగారు కృష్ణ, ఎంపీటీసీలు కాలి అనురాధ, కుంచే బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతతోనే ప్రగతి

సామర్లకోట: ప్రతి ఇంటా ప్రతి ఒక్కరూ చదువుకోవడం ద్వారా సమాజ ప్రగతి సాధించడానికి వీలు కలుగుతుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులచే ఏర్పాటు చేసిన అక్షరాస్యత ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు, నేటి చదువరి రేపటి నాయకుడు అంటూ నినాదాలు చేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వి.రాజు, జి.గోవిందు, కె. అరుణ, ఏఎల్‌వీ కుమారి, డీవీఆర్ఎస్ వల్లీ, కె.శ్రీనివాసు, పి.బ్రహ్మానందం, శైలజ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో అక్షరాస్యతపై ఉపాధ్యాయుల ర్యాలీ

ప్రైవేటు స్కూల్‌కు షోకాజ్ నోటీసు

సామర్లకోట: పీబీ దేవం గ్రామంలోని త్రివర్ణ ఇంగ్లిషు మీడియం స్కూల్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి పీవీఎస్ రామ్‌నాథ్ శుక్రవారం ధ్రువీకరించారు. పంచాయతీ అనుమతులు లేకుండా నిర్మించిన స్కూల్ భవనాన్ని, పంచాయతీ చట్టం 1994కు లోబడి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ నెల 16వ తేదీ ఉదయం 10.30 నిమిషాలకు పంచాయతీ కార్యాలయంకు వచ్చి పాఠశాల రికార్డులు అందజేయాలని నోటీసులో పేర్కొన్నారు. వచ్చే నెల ఏడో తేదీ లోపు సంజాయిషీ ఇవ్వకపోతే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

ఇసుకతో నింపకుండానే కోనేటిలో నీరు!

- పురావస్తు శాఖ అవినీతిపై విచారణ చేయాలని ట్రస్టు బోర్డు డిమాండ్



బురదమయంగా కనిపిస్తున్న కోనేరు

సామర్లకోట: పంచారామ క్షేత్రం ఆలయ కోనేరులో పూర్తిగా ఇసుక వేయకుండా నీటితో నింపారని ట్రస్టు బోర్డు సభ్యులు ఆరోపించారు. శుక్రవారం వారు స్థానిక పంచారామ క్షేత్రంలో విలేకర్లతో మాట్లాడుతూ కోనేరు అభివృద్ధికి రూ.30 లక్షలు విడుదలయ్యాయని ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు, సభ్యులు వివరించారు. ఆ నిధులతో పురావస్తు శాఖ అధికారులే కోనేరులో పూడిక తీత ప్రారంభించారని, కోనేటిలో ఎంత మట్టి తీస్తే అంత ఇసుక వేస్తామని అధికారులు చెప్పారని, ఆ విషయం తమకు చెప్పకుండానే నీటితో నింపేశారని వారు ఆరోపించారు. మట్టి తీత సమయంలో కోనేరు నింపడానికి ఒక దాత గ్రావెల్ ఇచ్చారని, దానిపై ఐదు ట్రక్కుల ఇసుక వేసి కోనేటిని నీటితో నింపారని తెలిపారు. కోనేటిలో ఇసుక వేస్తే నీరు తెల్లగా ఉంటుందని, నీరు బురద రంగులో ఉన్నదని సభ్యులు తెలిపారు. దీని వల్ల ఎటువంటి ఉపయోగం లేదని, నిధులు దుర్వినియోగం అయ్యాయని వారు తెలిపారు. ఈ అవినీతిపై విచారణ చేయాలని జిల్లా కలెక్టరుకు పురావస్తుశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినట్టు వారు తెలిపారు. ఈ ఆరోపణలపై పురావస్తుశాఖ సీఐ మూర్తిని వివరణ కొరగా కోనేటి పనులలో ఎటువంటి అవకతవకలు జరుగలేదన్నారు. కోనేరులో ఇసుక వేశామని, నీరు లేక పోవడం వల్ల భక్తులు ఇబ్బంది పడుతున్నారనే వత్తిళ్ల మేరకు నీరు పెట్టామని, వేసవిలో మరో పర్యాయం ఇసుక వేస్తామని చెప్పారు.

ప్రజా కళకు ఊపిరి గరికపాటి

పెద్దాపురం: ప్రజా కళాకారులకు ఊపిరి పోసిన గరికపాటి రాజారావు జీవితాన్ని ప్రతి కళాకారుడు ఆదర్శంగా తీసుకోవాలని స్నేహ ఆర్ట్స్ అధ్యక్షులు గొందేశి రాజా పిలుపునిచ్చారు. మండలంలోని చంద్రమాంపల్లిలో శుక్రవారం గరికపాటి 60వ వర్ధంతిని స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాల ప్రారంభంలో సాంస్కృతిక వ్యవస్థను ఆయన ప్రారంభించారన్నారు. సమసమాజ భావజాలంతో కళను, కళారూపాలను తీర్చిదిద్దిన ఘనత గరికిపాటికే దక్కిందన్నారు. ఆయనకు నివాళులు అర్పించిన వారిలో కేదారి నాగు, మంతెన సత్తిబాబు, మాగాపు నాగు, దేవాడ పాపేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గరికపాటి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్నేహ ఆర్ట్స్ కళాకారులు

వరలక్ష్మీ నమోస్తుతే..

- భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



దుర్గాడలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

పిఠాపురం: శ్రావణమాసంలో చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. సుమారు 300 మంది మహిళలు వ్రతాలు ఆచరించారు. ఆలయ అర్చకులు వీరబాబు, దత్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా వ్రతాలు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

వరలక్ష్మీదేవిగా మరిడమ్మ తల్లి

పెద్దాపురం: వరాలిచ్చి దీవించే మరిడమ్మ అమ్మవారు శుక్రవారం వరలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.రామ్మోహనరావు, ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు.

శృంగార వల్లభుడి ఆలయంలో..

తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయంలో శ్రావణంలోని ఆఖరు శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయగా, సుమారు 1200 మంది మహిళలు వ్రతమాచరించారు. ఆలయ కమిటీ సభ్యులు అడబాల జగ్గారావు, రాకుర్తి కుమారి, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఆఖరి శ్రావణ శుక్రవారం మహిళలు వరలక్ష్మి పూజను ఘనంగా నిర్వహించారు. కనకదుర్గ, వనదుర్గ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు వారిళ్లలో వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు.

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు భారీగా జరిగాయి. వ్రతాల్లో పాల్గొన్న భక్తులు బియ్యం, కలశ పాత్ర మాత్రమే తీసుకొని రాగా, వ్రతాలకు కావలసిన వరలక్ష్మీ రూపు, తోరాలు, లక్ష్మీదేవి ఫోటో, గాజులు, పువ్వులు, ప్లేటు, ప్రమిదలు, ఒత్తులు, నూనె, ప్రసాదం ట్రస్టు బోర్డు ఏర్పాటు చేసినట్టు ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు తెలిపారు. ఆలయ మొదటి అంతస్తు ప్రాకారం చుట్టూ వ్రతాలకు ఏర్పాట్లు చేశారు. ఈఓ వి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు లక్ష్మీదేవి చిత్ర పటం వద్ద పూజలు చేసి ప్రారంభించారు. ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న వినయ్, చెరుకూరి రాంబాబు పూజలు చేయించారు. ఈ వ్రతాల్లో సుమారు 500 మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. నాతిపాముల సూరిబాబు, యండమూరి వెంకట సుబ్బారావు, కర్రి వెంకటలక్ష్మి, బొండలపు కృష్ణవేణి, చల్లా కుమారి, భక్త సంఘ నాయకులు అంజనీకుమార్, బీవీ రమణ, చల్లా సత్తిబాబు భక్తులకు సేవలందించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రైల్వే బోర్డు ఈడీ పూజలు

కాగా పంచారామ క్షేత్రంలో రైల్వే బోర్డు ప్రిన్సిపాల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు రాజేష్ ఫతాక్, దక్షిణ మధ్య రైల్వే ట్రాఫిక్ మేనేజర్ ఆర్ సుదర్శన్ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయన వెంట స్థానిక స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో రైల్వే సిబ్బంది స్వాగతం పలికారు.

భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

కొత్తపల్లి: శ్రావణమాసంలో చివరి శుక్రవారం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పండితులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. కొత్తపల్లి శ్రీధర్మశాస్తా ఆలయంలోని దుర్గాదేవి, కొత్తదొడ్డిలో బాలదుర్గ, యండపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొండెవరం గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో సామూహిక వ్రతాలు, పూజలు నిర్వహించారు.



కుమారారామ భీమేశ్వర ఆలయంలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



శృంగారవల్లభ ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు